క్లుప్తంగా

ఎస్‌కేవీటీ కళాశాలలో జాబ్ మేళా



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న దివీస్ ప్రతినిధి

సీటీఆర్ఐ: స్థానిక ఎస్‌కేవీటీ కళాశాలలో సెంటర్ ఫర్ ఎంప్లాయిబిలిటీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. దివీస్ కంపెనీ ప్రతినిధులు సీహెచ్ పూర్ణ హరిప్రసాద్, కె.శరత్, హెచ్‌ఆర్ తదితరులు హాజరై, సుమారు 60 మంది అభ్యర్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ చూపిన వారికి త్వరలోనే నియామక పత్రాలు అందజేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బీబీ తిరుపాణ్యం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.స్వర్ణశ్రీ, స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పీవీబీ సంజీవరావు, జి.శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కంబాలచెరువు: స్థానిక బాలికల హైస్కూలు విద్యార్థులకు శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండవ పట్టణ ఇన్‌స్పెక్టర్ శివగణేష్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టెక్నాలజీని వాడుకుని నేరగాళ్లు డబ్బులు దోచుకుంటున్నారన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో అపరిచితులతో చాటింగ్ చేయవద్దని సూచించారు. అనవసర లింక్‌లను క్లిక్ చేయడం వల్ల అనేక అనర్థాలు కలుగుతున్నాయన్నారు. ముఖ్యంగా ఓటీపీలను ఎవ్వరికీ చెప్పకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలని, అలాగే డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్ క్రైం.గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైబర్ ల్యాబ్ సిబ్బంది వైవీ.సురేష్, పి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ రంభ ఊర్వశి డౌన్, కంచుమర్తి వారి వీధి, ముత్తంగి వారి వీధి, గొల్ల వీధి, కృష్ణుడి గుడి వీధి, మంగళవారపు పేట, ట్రైనింగ్ కాలేజీ వెనుక వీధి, జెట్టి కాంప్లెక్స్, కుమ్మరి వీధి, శ్యామలాంబ రోడ్, భావనారుషి గుడి వీధి మొదలగు ఏరియాల్లో అంతరాయం కలుగుతుందన్నారు.

పాత డీపీఆర్ ప్రకారమే 'పోలవరం' నిర్మించాలి

రాజమహేంద్రవరం సిటీ: పాత డీపీఆర్ ప్రకారం 47.5 మీటర్ల ఎత్తులో పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని పోలవరం ప్రాజెక్టు నిర్మాణ నిర్వాసితుల అధ్యయన కమిటీ చైర్మన్, పీసీసీ ఉపాధ్యక్షుడు ఎస్.మార్టిన్ లూథర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన రాజమహేంద్రవరంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు పెండింగ్ ప్రాజెక్టులను పక్కన పెట్టి, స్వార్థ ప్రయోజనాల కోసం అర్థం పర్థం లేదని ప్రాజెక్టులు కట్టడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. బనకచర్లను ఆపి, పోలవరాన్ని పూర్తి చేయకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

తల్లీ కుమార్తెల అదృశ్యం

సీతానగరం: సింగవరానికి చెందిన తల్లీకుమార్తెల అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.రామ్ కుమార్ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. సబ్బితి కృష్ణంరాజు, మునికన్య భార్యాభర్తలు. వారికి తొమ్మిదేళ్ల సృజన అనే కుమార్తె ఉంది. మునికన్య తన భర్తతో గొడవపడి గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు కుమార్తెను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. అదే గ్రామంలోని అత్తింటికి వెళ్లి ఆరా తీయగా రాలేదని తెలియడంతో ఆమె భర్త శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ కండక్టర్‌పై దొంగల దాడి

బిక్కవోలు: ఆర్టీసీ కండక్టర్‌పై దొంగలు దాడి చేసి సెల్‌ఫోన్, నగదు లాక్కుని పరారయ్యారు. వివరాల్లోకి వెళితే.. ఊలపల్లికి చెందిన ప్రసాద్ ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. రాజమహేంద్రవరం డిపోలో విధులు ముగించుకుని బైక్‌పై గురువారం రాత్రి తన స్వగ్రామానికి వస్తున్నాడు. బలభద్రపురం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై అతడిని నలుగురు దొంగలు అటాకాయించారు. అతడిపై దాడి చేసి సెల్‌ఫోన్, నగదు తీసుకుని పారిపోయారు. బాధితుడు బిక్కవోలు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ సుమంత్, ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఘనంగా అనఘాష్టమి పూజలు

అనపర్తి: గ్రామంలోని ఔదంబర దత్త పీఠంలో శుక్రవారం అనఘాష్టమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త, ప్రముఖ హోమియో వైద్యుడు డాక్టర్ మల్లిడి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రతి నెలా ఈ పూజలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ముందుకు కదిలేదెలా..

- నగరంలో ట్రాఫిక్ కష్టాలు
- ఉదయం, సాయంత్రం వేళల్లో తరచూ జామ్‌లు
- ముఖ్య కూడళ్లలో రద్దీ
- ఆక్రమణకు గురైన రోడ్లు



రోడ్డు పక్కనే ద్విచక్ర వాహనాలు నిలిపివేయడంతో దారి లేక ఆగిపోయిన కారు



రోడ్డు మీద నిర్వహిస్తున్న పండ్ల దుకాణం

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రధాన కూడళ్ల వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి. నగరంలో జనాభా రోజురోజుకూ పెరగడంతో పాటు రోడ్ల విస్తరణ లేకపోవడంతో ఈ సమస్య ఎదురైంది. అలాగే ఉన్న రోడ్లను ఆక్రమించి కొందరు వ్యాపారాలు చేయడం కూడా మరో కారణం. రోడ్డు పక్కనే ఉన్న దుకాణాల వల్ల సరకులు, పండ్లు, ఇతర వస్తువులను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆగుతున్నారు. తమ వాహనాలను రోడ్డ పక్కనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్డు చిన్నదిగా మారి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

ముఖ్య కూడళ్లలో..

కంబాల చెరువు, కోటగుమ్మం, మెయిన్ రోడ్డు, దేవీ చౌక్, జాంపేట, డీలక్స్ సెంటర్, కోటిపల్లి బస్టాండ్ తదితర ముఖ్య ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువగా ఉంది. అసలే ఇరుకు రోడ్లు కావడంతో పాటు సైకిల్, తోపుడు బండ్ల వ్యాపారులు రోడ్డును ఆక్రమించి సాయంత్రం వేళలో పువ్వులు, పండ్ల దుకాణాలు, మొబైల్ టిఫిన్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. దీంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోతున్నాయి.

రాకపోకలకు అంతరాయం

నగరంలోని ప్రధాన సెంటర్లలో వాహనాలు నిలుపుకోవడానికి పార్కింగ్ స్థలాలు లేకపోవడం కూడా ట్రాఫిక్ సమస్యకు ఒక కారణం. ముఖ్యంగా కంబాల చెరువు సెంటర్‌లోని ఎస్‌బీఐ వద్ద ద్విచక్ర వాహనాలు, కార్ల పార్కింగ్ స్థలం ఉన్నప్పటికీ, దానిలో పువ్వులు, పండ్ల వ్యాపారులు దుకాణాలు పెట్టుకుంటున్నారు. అక్కడకు వచ్చిన ఖాతాదారులు రోడ్డుపైనే తమ వాహనాలను నిలుపుతున్నారు. ఆ ప్రాంతంలో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు ఆగిపోయి, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఫుట్‌పాత్ వ్యాపారుల ఆక్రమణలకు నగరపాలక సంస్థలోని కొందరు అవినీతి అధికారులు కొమ్ము కాయడం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని కొందరు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

పార్కింగ్ స్థలాల ఏర్పాటుకు చర్యలు

నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో వాహనాలు నిలిపేందుకు నగరపాలక సంస్థ 84 చోట్ల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. వీటిలో అధికంగా ప్రైవేటు స్థలాలే ఉన్నాయి. నగరంతో పాటు చుట్టుపక్కల గల విలీన ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని, నిత్యం రద్దీగా ఉండే చోట ప్రైవేటు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయనున్నారు. అక్కడ వాహనాల నిలుపుదలకు నిర్దేశించిన రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

శాకంబరిగా వాసవీ మాత



శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చిన వాసవీ మాత

ధవళేశ్వరం: స్థానిక రామ పాదాలరేవు వద్ద ఉన్న చక్ర సహిత వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలోని అమ్మవారు శుక్రవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం శాకంబరి అలంకరణను తొలగించి, ఆ కూరగాయలతో కదంబ ప్రసాదాన్ని తయారుచేసి వితరణ చేయనున్నారు. కార్యక్రమంలో వాసవీ మాత ట్రస్ట్ సభ్యులు, యువ వైశ్య సభ్యులు, వాసవీ మహిళా సమాజం సభ్యులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాలు తప్పకుండా పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి శుక్రవారం మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి అధ్యక్షతన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన రెవెన్యూ, పోలీసు అధికారులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారన్నారు. మోటారు వాహనాల చట్టం 1988, హిట్ అండ్ రన్ మోటార్ యాక్సిడెంట్స్ స్కీమ్ 2022 నిబంధనలను అనుసరిస్తూ బాధితులకు పరిహారం అందించేందుకు ఈ కమిటీ సభ్యులు సహకారం అందించాలన్నారు. సదస్సులో కాకినాడ జిల్లా ఏఎస్పీ ఎంజీవీ భాస్కరరావు, చింతూరు ఏఎస్పీ ఎం.పంకజ్ కుమార్, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల, పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి, రాజమహేంద్రవరం పోలీసు, ట్రాఫిక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర పోషక యాజమాన్యంతో చీడపీడల నియంత్రణ

రాజానగరం: నేల స్వభావం, ఎరువుల వాడకం, వాతావరణ పరిస్థితులను బట్టి చీడపీడల ఉధృతి ఆధారపడి ఉంటుందని దివాన్ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. మండలంలోని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో జిల్లాలోని వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులకు సర్టిఫికెట్ కోర్సులో భాగంగా గత 12 రోజులుగా ఇస్తున్న శిక్షణను శుక్రవారం ఆయన సందర్శించారు. 'నేల స్వభావం, చీడపీడల ఉధృతి, యాజమాన్య పద్ధతులు' అనే అంశంపై శిక్షకులకు అవగాహన కలిగించారు. ప్రయోగశాలలో శాస్త్రవేత్తలు చేసిన పరిశోధన సిఫార్సుల మేరకు సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, రసాయన ఎరువులు వాడి, భూసార పరిరక్షణ చేసుకుంటూ మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. శిక్షకులతో కలిసి ఖరీఫ్ సాగు చేస్తున్న వరి పంట క్షేత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకుందాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీపీవో అనంత ప్రదీప్

రాజమహేంద్రవరం రూరల్: బాల్య వివాహాలను సమష్టిగా అడ్డుకుందామని జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ (డీసీపీవో) అనంత ప్రదీప్ అన్నారు. కొంతమూరులోని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం చైల్డ్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత ప్రదీప్ మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎక్కడ జరుగుతున్నా అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కనీస వివాహ వయసు రాకుండా పెళ్లిళ్లు చేసుకోకూడదని, తల్లిదండ్రులు బలవంతం చేసినా ధైర్యంగా తిరస్కరించాలన్నారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ గుల్జార్ బేగం మాట్లాడుతూ వివాహ వయసును అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లుగా నిర్ధారించారన్నారు. బాల్య వివాహాలు చేసిన, సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు మోహిని, డ్వాక్రా వీవో ఎం.సుగుణ, జీఎంఎస్‌కే శివజ్యోతి, వీఆర్‌వో శంకర్ పాల్గొన్నారు.

సత్యసాయి శత జయంతిలో సమష్టిగా సేవలు



వెంకటేశ్వర్లుకు పదవీకాలం పొడిగింపు పత్రం అందజేస్తున్న ప్రముఖులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సత్యసాయి శత జయంతిలో సమష్టిగా సేవలు అందించాలని సత్యసాయి మందిర అధ్యక్ష, కార్యదర్శులు దండమూడి గిరిధర్, ఘంటా హనుమంతరావు, సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ అయోధ్యుల శ్యామసుందర్ కోరారు. అల్కాట్‌తోటలోని సత్యసాయి మందిరంలో శుక్రవారం రాత్రి జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వచ్చే ఏడాది డిసెంబర్ నెలాఖరు వరకు ప్రస్తుత సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు పదవీ కాలం పొడిగించడంపై హర్షం వ్యక్తం చేశారు. జిల్లా సేవా సంస్థ కార్యక్రమాలకు తమ వంతు సహకారాన్ని ఎప్పుడు అందిస్తామన్నారు. బాబా శతజయంతి ఉత్సవాలు, సంస్థ చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలను విజయవంతం చేయటానికి నిస్వార్థంగా సేవలు అందిస్తానని జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా మహిళా సేవా విభాగ సమన్వయకర్త బిక్కిన రామలక్ష్మి, జోనల్ కన్వీనర్ బి.విజయసాయి, ఏవీ అప్పారావు రోడ్డు సమితి కన్వీనర్ వెంకటేశ్వరరావు, మందిర్ కోశాధికారి సుబ్రహ్మణ్యం, కుమార్ తదితరులు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై నాగరాజు

కోరుకొండ: సైబర్ నేరాలు, గంజాయి వాడకం వల్ల కలిగే అనర్థాలు, పోక్సో చట్టంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని, తద్వారా ప్రజలకు చైతన్యం కలిగించాలని ఎస్సై కూన నాగరాజు అన్నారు. పశ్చిమగానుగూడెంలోని సృజన కాలేజీలో శుక్రవారం సాయంత్రం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సమాజంలో మార్పు విద్యార్థుల ద్వారానే జరుగుతుందన్నారు. మోటార్ వెహికల్ చట్టం ప్రకారం వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్, అన్నిరకాల అనుమతులుండాలన్నారు.

బాలల సంరక్షణకు అందరూ కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్త్రీ శిశు సంక్షేమ సాధికారిత అధికారి లక్ష్మి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బాలల సంరక్షణ, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారిత అధికారి సిహెచ్ లక్ష్మి అన్నారు. మంగళవారపుపేటలో శుక్రవారం చైల్డ్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిహెచ్ లక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో గ్రామస్థాయిలో 299, వార్డు స్థాయిలో 101 చైల్డ్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. బాల్య వివాహ నిషేధ చట్టం 2006, బాలలపై జరుగుతున్న వేధింపులు, పోక్సో చట్టం 2012, మిషన్ వాత్సల్య పథకం ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. పాఠశాలల్లో బాలల పంచాయతీలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో కె.నాగలక్ష్మి, ప్రొటెక్షన్ ఆఫీసర్ (ఎన్ఐసీ) జి.క్రాంతి లాల్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కంబాలచెరువు: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 25 తేదీన విజయవాడలోని ధర్నాచౌక్‌లో చేపట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రఫీ, ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ అన్నారు. వారు శుక్రవారం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యారంగంలో సమస్యలను పరిష్కరించాలని చలో విజయవాడకు పిలుపునిచ్చామన్నారు. ఈ సందర్భంగా రాజమండ్రి ఎస్టీ బాలుర హాస్టల్, మావో భవన్‌లోని పీడీఎస్‌యూ కార్యాలయంలో మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయిందని, కానీ విద్యా రంగ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. విలీన ప్రక్రియ వల్ల వేలాది పాఠశాలలు మూతపడుతున్నాయన్నారు. విద్యారంగాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పుస్తకాలు, యూనిఫాం, స్పెషల్ ఫీజు పేర్లతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు భాను, కోశాధికారి రూప శంకర్, రాష్ట్ర నాయకులు నాగరాజు, శ్రీను, షాహిద్, నవీన్, చంద్రశేఖర్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలతో అవినీతి సంపద

- బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి తీరు దారుణం
- చెరువుల్లో యథేచ్ఛగా తవ్వకాలు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- బిక్కవోలు లింగాల చెరువు పరిశీలన



బిక్కవోలు లింగాల చెరువులో మట్టి అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: సంపద సృష్టి పేరుతో కూటమి నాయకులు అవినీతి సంపదను పోగుచేసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బిక్కవోలు గ్రామంలోని లింగాల చెరువులో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ప్రాణాధారంగా నిలిచే చెరువులను కూడా అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సొంత ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారన్నారు. లింగాల చెరువు నుంచి నాలుగు రోజులుగా రోజుకు వెయ్యి ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నారన్నారు. కాకినాడ జిల్లాలోని కరప ప్రైవేటు లేఅవుట్లకు ఈ మట్టి రవాణా అవుతోందన్నారు. చెరువు లోతుగా మారడం వల్ల పలు ప్రమాదాలు జరుగుతాయని, పశువులు దిగటానికి కూడా ఇబ్బందులు కలుగుతాయన్నారు. గతంలో ఇదే ఎమ్మెల్యే బిక్కవోలు గ్రామంలోని పేదల భూమిలో మట్టిని తవ్వి, దాదాపు రెండు కోట్ల రూపాయల విలువైన మట్టిని అమ్మి పెట్టుకున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. గతంతో కాపవరం చెరువులో నలుగురు మరణించారని, నల్లమిల్లి గ్రామంలో కూడా ప్రాణనష్టం జరిగిందన్నారు. ఇప్పుడు ఇలాగే చెరువుల మట్టిని తవ్వి, గట్లు లేకుండా వదిలేసి, ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్నారన్నారు. ఎమ్మెల్యే అవినీతి చర్యలను ఎప్పటికప్పుడు బహిరంగం చేస్తూ ఉంటామన్నారు. చెరువులు, రైతుల హక్కులు, నీటి ప్రాముఖ్యతపై రాజీ పడబోమని స్పష్టం చేశారు. రైతుల కోసం వైఎస్సార్ సీపీ తరపున పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలోని మాజీ ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్ రెడ్డి, వైఎస్సార్ సీపీ గువ్వల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'సత్యసాయి' కార్మికుల నిరసన



నిరసనలో పాల్గొన్న సత్యసాయి పథకం కార్మికులు

రాజమహేంద్రవరం రూరల్: తమ వేతనాల బకాయిలు విడుదల చేయాలంటూ లాలా చెరువు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం వద్ద సత్యసాయి తాగునీటి సరఫరా పథకం కార్మికులు చేపట్టిన నిరసన శుక్రవారానికి 11వ రోజుకు చేరుకుంది. 19 నెలలు జీతాల బకాయిలతో పాటు, 26 నెలల ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీను, ఇసాక్ తెలిపారు. 52 మంది కార్మికులు జీతాలు లేక అలమటిస్తున్నా కూటమి ప్రభుత్వంలోనూ, అధికారుల్లోనూ ఎటువంటి చలనం లేదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేవరకూ సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. సమ్మెలో కోశాధికారి కె.రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

లక్షల రూపాయలు కట్టి మోసపోయాం

- కనీస వసతులూ కల్పించలేదు
- బ్రిడ్జికౌంటీ నివాసితుల ఆవేదన



ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న బ్రిడ్జి కౌంటీ వాసులు

రాజానగరం: తమ నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి, సరైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా మోసం చేశారని బ్రిడ్జి కౌంటీలోని నివాసితులు వాపోయారు. ఈ మేరకు ప్లకార్డులు చేతపట్టుకుని, తమ నివాసాల ముంగిట శుక్రవారం నిరసన తెలిపారు. కోర్ కమిటీ సభ్యులు మాధవ్‌దాసు, వెంకట్రావు, రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ రహదారిని ఆనుకుని 50 ఎకరాల విస్తీర్ణంలో మినీ అమెరికా పేరుతో 2013లో వెంచర్ వేస్తే, నిజంగా ఆ స్థాయిలోనే అభివృద్ధి చేస్తారేమోనని ఆశ పడి అప్పులు చేసి విల్లాలు, అపార్టుమెంట్లు తీసుకున్నామన్నారు. అనంతరం మినీ అమెరికా పేరును బ్రిడ్జి కౌంటీగా మార్చేసి తమనే ఏమార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్కులు, షాపింగ్ మాల్స్, క్లబ్, జిమ్, మోడ్రన్ స్కూల్, స్విమ్మింగ్ పూల్, విశాలమైన రోడ్లు, మంచినీటి సదుపాయం .. ఇలా సకల సదుపాయాలు 2017 నాటికల్లా అందిస్తామంటే నమ్మామన్నారు. దశాబ్ద కాలం దాటిపోయినా నేటికీ ప్రైవాటిలో ఏ ఒక్కటీ పూర్తి కాలేదన్నారు. క్లబ్ హౌస్ కోసం ప్రత్యేకంగా సొమ్ములు తీసుకున్నారని, ఇప్పటి వరకు ఒక్క ఇటుక కూడా పెట్టలేదన్నారు. రోడ్లు పాడై పిచ్చి మొక్కలు మొలిచి వెక్కిరిస్తున్నాయని ఆవేదన చెందారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

సీతానగరం: బొబ్బిల్లంకలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను స్టేట్ లెవెల్ విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఏడీఏ రవీంద్ర బొబ్బిల్లంకలోని వెంకటేశ్వర ఏజెన్సీ, దేవీసత్య ఫెర్టిలైజర్ షాపుల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్లు, సేల్స్ రిజిస్టర్లను పరిశీలించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో దుకాణాల్లో ఎరువుల స్టాక్ తక్కువగా ఉందని, కొనుగోలు, అమ్మకాల్లో ఎటువంటి తేడాలు లేవన్నారు. కార్యక్రమంలో కోరుకొండ ఏడీఏ మల్లికార్జునరావు, ఏవో ఎ.గౌరీదేవి, ఏఈవో గురుప్రియ, వీఏఏ రమాదేవి పాల్గొన్నారు.



బొబ్బిల్లంక ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు